ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

గురువారం 11 జూలై 2024



నిర్మాణం పూర్తయిన గణపురం మండలం ధర్మారావుపేట ఊర చెరువు కట్ట

మళ్లీ మంచిరోజులు!

- యుద్ధప్రాతిపదికన చెరువుల పునరుద్ధరణ
- రూ. 25 కోట్లతో ముమ్మరంగా పనులు
- 10వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నదే లక్ష్యం
- ఈ వానాకాలంలోనే అందించేందుకు చర్యలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 10: గత ఏడాది సంభవించిన ప్రకృతి వైపరీత్యాన్ని తలచుకుంటే.. ఇప్పటికీ వెన్నులో వణుకు వస్తోంది. జూలై 27 రాత్రిని మరచిపోలేం. కుంభవృష్టి వర్షం భూపాలపల్లి జిల్లాను అతలాకుతలం చేసింది. వాగులు వంకలు పొంగిపోర్లాయి.. చెరువులు దెబ్బతిన్నాయి. జలదిగ్బంధనంలో జనం చిక్కుకొని విలవిలలాడారు. ఊర్లను వరద ముంచెత్తింది. ఇల్లు చెదిరి అనేక మంది నిరాశ్రయులయ్యారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు. పొలాల్లోకి నీరు చేరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ధ్వంసమైన చెరువులు

గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి నియోజకవర్గంలోని చెరువులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏడు మండలాల పరిధిలో మొత్తం 162 చెరువులు ధ్వంసమయ్యాయి. మరింత నష్టం వాటిల్లకుండా వీటిలో కొన్నిటిని రైతుల సాయంతో నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. మిగిలిన 124 చెరువుల్లో కొన్నిటి కట్టలు పూర్తిగా కొట్టుకుపోయాయి. మరికొన్నిటి మత్తడులు, తూములు ధ్వంసమయ్యాయి. ఎక్కువ శాతం చెరువులు కట్టలు కొట్టుకుపోవడంతోపాటు పొలాలకు సాగు నీరందించే కాల్వలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. భూపాలపల్లి మండలంలో కొత్తపల్లి(ఎస్ఎం), రేగొండ మండలంలోని చిన్నకోడేపాక తదితర పెద్ద చెరువులు వరద ఉధృతితో పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వానలకు దెబ్బతిన్న చెరువుల్లో కొన్నిటిని అధికారులు అప్పటికప్పుడు పునరుద్ధరించి సాగునీరు అందించారు. మిగిలిన 124 చెరువులు మాత్రం పూర్తిగా ధ్వంసం కావడంతో రైతులు గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేయలేదు. సాగునీరు అందక సుమారు 10వేల ఎకరాలు పూర్తిగా బీడువారి పోయాయి.

రూ. 25 కోట్లతో పునరుద్ధరణ

భూపాలపల్లి నియోజకవర్గంలో పూర్తిగా దెబ్బతిన్న 124 చెరువుల పునరుద్ధరణ పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. రూ. 25 కోట్ల ప్రత్యేక నిధులతో ఆయకట్టుకు ఖరీఫ్ పంటకు నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. దెబ్బతిన్న చెరువుల కట్టలు, మత్తళ్లు, తూములను పునరుద్ధరిస్తున్నారు. 75 శాతం చెరువులకు సంబంధించిన పనులను ఇప్పటికే పూర్తి చేసిన అధికారులు కాల్వల పునరుద్ధరణపై దృష్టి సారించారు. రైతులు పంటలు వేసుకునే సమయం సమీపిస్తుండటంతో పనుల్లో వేగం పెంచారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

భారీ వర్షాలతో దెబ్బతిన్న చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరగ డంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు ప్రత్యేక చొరవ చూపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన సమావే శమయ్యారు. చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పాలనపరమైన అనుమతులు తెప్పించారు. పనులు వేగంగా జరిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో తనకున్న ప్రత్యేక అనుబంధంతో రూ.25 కోట్ల నిధులను మంజూరు చేయించుకున్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల అధికారులతో మాట్లాడి అంతకుముందే పాలన అనుమతులు పొందిన టెండర్ నమోదు చేసిన పనులను ప్రారంభించేలా ఎమ్మెల్యే విశేష కృషి చేశారు.



ధ్వంసమైన 124 చెరువుల మరమ్మతులకు రూ. 25 కోట్లు మంజూరు చేయించి, యుద్ధప్రతిపాదికన పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. కొన్ని చోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల పనులు 90శాతం పూర్తయ్యాయని, ఈ వానాకాలంలోనే రైతులకు చెరువుల ద్వారా సాగునీరు అందించి తీరుతామని చెప్పారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని అన్నారు.

అధికారుల అలసత్వమే కారణం!

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు దెబ్బతినడంలో అధికారుల అలసత్వం ఉన్నట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. చేపలు

» మిగతా 6వ పేజీలో...



భూపాలపల్లి మండలం దొమ్మటిపల్లి చెరువు వద్ద కాల్వల నిర్మాణం



చేపల కోసం రేగొండ మండలం లింగాల చెరువు మత్తడికి ఏర్పాటు చేసిన ఇనుప జాలీని తొలగిస్తున్న అధికారులు

కాంగ్రెస్ వెంటే ప్రజలు

- పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ తగ్గలేదు
- పోలింగ్ శాతం మాత్రమే తగ్గింది
- భూపాలపల్లి ఓటర్లకు రుణపడి ఉంటాం
- ఎంపీ కావ్య అభినందన సభలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 10: ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో చూపిన ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. ఎంపీ కడియం కావ్య అభినందన సభ భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ కావ్యతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ తగ్గలేదని, పోలింగ్ శాతం మాత్రమే తగ్గిందని తెలిపారు. ప్రజలు చూపిన ఆదరణను ఎన్నటికీ విస్మరించబోమ అన్నారు. మారుమూల ప్రాంతమైన భూపాలపల్లిని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంచుతామన్నారు. కేంద్రంతో కొట్లాడినైనా భూపాలపల్లికి రైల్వేలైన్, ఇండస్ట్రియల్ కారిడార్ తదితర అభివృద్ధి పనులను మంజూరు, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయించాలని ఎంపీ కావ్యను ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ డీబీఎం 38 కాల్వను రామప్ప నుంచి గోరికొత్తపల్లి వద్ద కలిపి 44వేల ఎకరాల పంట సాగుకు నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, త్వరలో రైతుల రూ.2లక్షల రుణమాఫీ కూడా సర్కారు చేసి తీరుతుందని తెలిపారు. మట్టి, ఇసుక అవసరం ఉన్నవారు నిర్భయంగా ట్రాక్టర్‌తో తీసుకెళ్లొచ్చన్నారు. లారీల ద్వారా తరలిస్తే ఎవరినైనా సహించేది లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడే పార్టీ శ్రేణులకు న్యాయం జరుగుతుందన్నారు.

ఆదరించినందుకు రుణపడి ఉంటా : కావ్య



ఎంపీ ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చి, ఆడబిడ్డగా ఆదరించి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని ఎంపీ కడియం కావ్య అన్నారు. తండ్రి కడియం శ్రీహరిని ఆదర్శంగా తీసుకుని పనిచేస్తానని, భూపాలపల్లి నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం ప్రజల కోసం పరితపించే ఉత్తమ నాయకుడని కొనియాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోదీలో ఓ నియంతను చూశానని వ్యాఖ్యానించారు. మణిపూర్ ఘటనపై ఆయన కనీసం నోరు విప్పకపోవడం దారుణమని విమర్శించారు. పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, క్రిస్టియన్లు అంటే మోదీకి గిట్టదని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటులో బలమైన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ ఉండటంతో భయపడుతూనే ఆయన ప్రభుత్వాన్ని నడుపుతున్నారని వ్యాఖ్యానించారు. 2029ఎన్నికల్లో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రధాని రాహుల్ గాంధీ అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రామ్‌నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సూర్యనేని తిరుమల్‌రావు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు బలవన్మరణం

అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య



లింగయ్య మృతదేహం

కాటారం, జూలై 10: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధి బస్వాపూర్ గ్రామానికి చెందిన కళ్లెం లింగయ్య (35) భార్య సుశీలతో కలిసి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. సొంతంగా వ్యవసాయం చేయాలనే ఆలోచనతో రెండున్నర ఎకరాల భూమిని రెండేళ్ల క్రితం కౌలుకు తీసుకొని పత్తిని సాగుచేస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, తేగుళ్లతో పంట దిగుబడి సరిగా రాలేదు. ఈక్రమంలో రెండేళ్ల కాలంలో రూ. 4 లక్షల అప్పు అయ్యింది. దీంతో మనస్తాపం చెందిన లింగయ్య మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంసభ్యులు గమనించి భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషపురుగు కాటేసి యువకుడి మృతి



దేవేందర్ మృతదేహం

మహదేవపూర్ రూరల్, జూలై 10 : విషపురుగు కాటేయడంతో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన రేవెల్లి దేవేందర్(23) మంగళవారం కూలి పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. కుడి కాలు మంటగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్ద తీసుకెళ్లారు. విషపురుగు కాటేసి ఉంటుందని, మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆయన సూచించడంతో అక్కడికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స అందిస్తున్న క్రమంలో దేవేందర్ బుధవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

ఎన్‌హెచ్ నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేయాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ


భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 10: జాతీయ రహదారుల నిర్మాణానికి నెలఖారు వరకు భూసేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. హైదారాబాద్ నుంచి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ ఎన్‌హెచ్ 163జీ రహదారి రాష్ట్రంలో 334 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. దీని నిర్మాణానికి 1,383 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,284హెక్టార్ల భూమికి అవార్డు పాస్ అయ్యిందన్నారు.415 హెక్టార్ల భూమిని జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలన్నారు. మిగిలిన 99 హెక్టార్ల భూసేకరణను నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులతో సమావేశం నిర్వహించి జాతీయ రహదారుల అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. గత 6 నెలల కాలంలో భూసేకరణ ప్రాంతాల్లో జరిగిన అత్యధిక విలువైన లావాదేవిల డ్యాక్యుమెంట్లు ఆర్బిట్రేషన్ ద్వారా జారీ చేసి అవార్డులతో జతచేయాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో కలెక్టర్లు నేరుగా రైతులతో చర్చించి మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామనే భరోసా కల్పించాలన్నారు. రహదారుల నిర్మాణంలో కోల్పోతున్న అటవీశాఖ భూములకు ప్రత్యామ్నాయంగా సీఏ భూములను గుర్తించి అటవీశాఖకు అందజేయాలన్నారు. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి జిల్లాలో 130.5 హెక్టార్ల భూమిని భూసేకరణ చేయాల్సి ఉందని సీఎంకు వివరించారు. పరిహారం నచ్చక రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదన్నారు. రైతులతో సమావేశం నిర్వహించి 10 రోజుల్లో జాతీయ రహదారుల ఆథారిటీకి అప్పగిస్తామని అన్నారు. సిరొంచ- మహదేవపూర్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన 20.909 హెక్టార్ల అటవీ భూమికి ప్రత్యామ్నయంగా సీఏ భూమి కేటాయింపు చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో లావణ్య, జాతీ య రహదారుల ఈఈ మనోహర్, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని ధర్నా



ములుగులో ధర్నా నిర్వహిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీలు

ములుగు కలెక్టరేట్, జూలై 10: ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం స్కీం వర్కర్లు, ఆశాలు, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాయం వద్ద బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెబోయిన రవిగౌడ్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించిందని అన్నారు. వీటి వల్ల కార్మికుల కనీస వేతనాలు పడిపోతాయన్నారు. కార్మికుల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఆశాలు, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అందించడంతోపాటు హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీలు పద్మారాణి, భాగ్యలక్ష్మి, సరిత, మోక్షారాణి, ధనలక్ష్మి, ఆశాలు మంజుల, రమాదేవి, కవిత, స్వాతి, సరిత, సుజాత, శ్రావణి, స్వర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.





పెద్దాస్పత్రిలో హృద్రోగులకు దిక్కెవరు?

కార్డియాలజిస్టులతో కొరతతో రోగులకు తప్పని అవస్థలు


పరీక్షలు చేసే వారు లేక నిరీక్షణ

వరంగల్ మెడికల్, జూలై 10: ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటికి పెద్దాస్పత్రి అయిన ఎంజీఎంలో కార్డియాలజీ విభాగం పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఈ విభాగంలో ఇద్దరే కార్డియాలజిస్టులు ఉన్నారు. వారూ సకాలంలో రారు. గుండె పరీక్షలు చేసే వైద్య పరికరాలు కూడా చాలినన్ని లేవు. గుండె పనితీరును గుర్తించడంలో కీలకంగా పని చేసే టూడీ ఎకో పరికరాలు రెండే ఉన్నాయి. ఎంజీఎంకు రోజు 100 నుంచి 150 మంది హృద్రోగులు గుండె పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. బుధవారం రోజు కూడా రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కానీ కార్డియాలజీ డాక్టర్లే లేరు. దీంతో టూడీ ఎకో పరీక్షలు చేసేవారే లేకుండా పోయారు. టూడీ ఎకో పరీక్షలు నిలిచిపోవడంతో హృద్రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోగులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షల కోసం వార్డులో పడిగాపులు కాశారు. డాక్టర్ల జాడ లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు టూడీ ఎకో పరీక్షలకు కోసం రోగులను కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించారు. రోగులు అక్కడి వెళ్లే సరికి అప్పటికే అక్కడ కార్డియాలజీ విభాగంలో టూడీ పరీక్షల కోసం రోగులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ఎంజీఎం నుంచి కూడా రోగులు రావడంతో వార్డులో రద్దీ పెరిగింది.



గుండె పరీక్షలకోసం బారులు తీరిన రోగులు

ఇప్పటికే రోగులు పెద్ద సంఖ్యలో ఉండగా ఎంజీఎం నుంచి సైతం రిఫర్ చేయడంపై సూపర్‌స్పెషాలిటీలోని డాక్టర్లు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పరీక్షలు చేయడానికి నిరాకరించారు. దీంతో ఇక్కడ కూడా డాక్టర్లకు, రోగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు డాక్టర్లతో ఘర్షణకు దిగారు. అధికారుల తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆస్పత్రిలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి చేసేది లేక రోగులు టూడీ ఎకో పరీక్షలు చేయించుకోకుండానే నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందటే వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి పరిస్థితిపై ఆయా విభాగాల అధిపతులతో సమీక్షించారు. ఎంజీఎంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయినా పరిస్థితి మారలేదు.



నగర సమగ్రాభివృద్ధికి కృషి

వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై10: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలోని వరంగల్ నగరంతో పాటు 180 గ్రామాలను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి చేస్తానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో స్థానిక సిబ్బందితో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకే నగరంలోని కాళోజీ కళాక్షేత్రం పనులు 70 శాతం పూర్తయ్యాయని, సెప్టెంబర్ 9 వరకు పనులు పూర్తి చేసి ప్రారంభ కార్యక్రమానికి సీఎం చేతులు మీదుగా ఆవిష్కరణ చేయిస్తామన్నారు. ఇంకా ఇన్నర్, ఔటర్ రింగు రోడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన యజమానులకు నష్టం జరుగకుండా పరిహారంతో ఆదుకుంటామన్నారు. ఇప్పటికే సీఎం నిధుల నుంచి రూ.350కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. నగరం చుట్టుపక్కల చాలా చోట్ల కుడాకు సంబంధించిన భూములు రియల్టర్లు ఆక్రమించుకున్నారని, సర్వే ద్వారా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

వరంగల్ నగరం నుంచి ఇప్పటికే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 50 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల క్రీడలకు శిక్షణ ఇప్పిస్తామని ఇనగాల పేర్కొన్నారు. అక్కడక్కడా ఉన్న ఆస్పతుల ద్వారా ఇతర ప్రాంతాల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం కుడా నిధులతో ఒకే చోట మెడికల్ జోన్‌లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. కుడాకు జీడబ్ల్యుఎంసీ నుంచి అద్దెల ద్వారా రూ.50కోట్లు రావాలని, ఆ ఫండ్‌తో నగరాన్ని సుందరీకరిస్తామన్నారు. కుడా పరిధిలో చాలా చోట్ల అనుమతులు లేకుండా లేఔట్ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు కుడా వెబ్‌సైట్ మూతబడి ఉందని, దానిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఎల్ఆర్ఎస్ చెల్లింపులతో పాటు కుడా అభివృద్ధి పనుల డాటా నిక్షిప్తం చేయవచ్చని అన్నారు. ప్రస్తుతం కుడాలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మరో 50 మంది సిబ్బందిని నియమిస్తామని వెల్లడించారు. కుడా అంటేనే ప్లాట్లు, డబ్బులు, లంచాలు, అక్రమాలు అనే ప్రచారం ఉందని, తమ హయాంలో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలా తమ పాలన ఉండబోదని ప్రజలు గుర్తించాలని, సిబ్బంది సైతం తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

రూ.850 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో కుడా అభివృద్ధి పనులకు రూ.850 కోట్ల నిధులు కావాలని కోరామని, ఇప్పటికే రూ.300కోట్లు విడుదలయ్యాయన్నారు. మిగతా పనులను బట్టి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. రూ.500కోట్లు ఇన్నర్ రింగ్‌రోడ్డు, రూ.50కోట్లు భద్రకాళి మాఢవీధులు, రూ.120కోట్లు వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, రూ.50కోట్లు కాళోజీ కళాక్షేత్రం, రూ.50కోట్లతో గుండు చెరువు అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజీత్‌రెడ్డి, మురళీధర్, భీంరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, జులై 10: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీట్‌బజార్‌లో బి.మహేందర్ నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. బీట్ బజార్‌లో వ్యాపారం చేసుకుంటున్న మహేందర్ అనే వ్యక్తి వద్ద నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడులు చేశారు. రూ.2లక్షల 61వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.




స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు





సముద్రాల పురుషోత్తమచార్య ఇక లేరు



హనుమకొండ కల్చరల్, జూలై 10: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో నాలుగు దశాబ్దాలుగా స్థానాచార్యులుగా పనిచేస్తున్న సముద్రాల పురుషోత్తమచార్య (87) మంగళవారం రాత్రి వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎక్సైజ్‌కాలనీలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన భార్య రంగనాయకమ్మ రెండేళ్ల కిందటే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వృత్తిరీత్యా నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా 1996లో ఉద్యోగ విరమణ చేశారు. ఆధ్యాత్మిక ప్రవచకుడిగా శ్రీ వైష్ణవ సంప్రదాయ ఆచార పరిరక్షకుడిగా ఉభయ వేదాంత పండితుడిగా, ఆధ్యాత్మిక భావజాలం ఉన్న ఆయనను.. కవిశాబ్దిక కేసరి నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి వెంకటేశ్వర ఆలయానికి పురుషోత్తమచార్యను స్థానాచార్యగా నియామకం చేశారు. అప్పటి నుంచి ఆలయంలో చుట్టుపక్కలకు కాలనీ చెందిన వేలాది మందికి ఆధ్యాత్మిక ఆచార్యుడిగా భక్తుల మన్ననలు అందుకున్నారు. బుధవారం మధ్యాహ్నం హనుమకొండ వికాస్ నగర్ ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఆయన పెద్ద కుమారుడు రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీధరాచార్యులు అంత్యక్రియలను నిర్వహించారు. పురుషోత్తమాచార్య మరణ వార్త ఎక్సైజ్ కాలనీ పరిసర ప్రాంత భక్తులను తీవ్ర దుంఖంలో ముంచెత్తింది. ఈయన మృతితో ఓరుగల్లు నగరం గొప్ప ఆధ్యాత్మికవేత్తను కోల్పోయిందని సత్ సంప్రదాయ పరిరక్షణ సభ కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్య విదేశాలనుంచి సంతాపం ప్రకటించారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కుండ వెకంట నర్సయ్య, తదితర అనేక మంది పెద్దయ్యగారు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయభూముల కబ్జాపై లోకాయుక్త విచారణ

హనుమకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని ఐదు దేవాలయాలకు చెందిన సుమారు 20.39 ఎకరాల భూమి కబ్జాపై బుధవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. పద్మాక్షి దేవాలయం భూమి 6.22ఎకరాలు, వీరపిచ్చమాంబ మఠం భూమి 30 గుంటలు, సిద్ధేశ్వరాలయానికి సంబంధించిన 2.24 ఎకరాలు, వేణుగోపాలస్వామి భూమి 1.11ఎకరాల అక్రమణలపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ జరిపింది. చక్రపాణి, రాజుతోపాటు దేవాదాయ శాఖ పక్షాన ముగ్గురు ఈవోలు విచారణకు హాజరయ్యారు. ప్రతీ సారి దేవాదాయ శాఖ నుంచి కింది స్థాయి అధికారులే హాజరుకావడం పట్ల లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసును ఈనెల 15కు వాయిదా వేస్తూ ఆ రోజుదేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.





పెనుగోలుకు వెళ్లేందుకు వాగు దాటుతున్న వైద్యాధికారి మధుకర్, సిబ్బంది, వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మధుకర్ బృందం

కాలినడకన వెళ్లారు.. వాగులు దాటారు..

అడవి పల్లెల్లో వైద్యసేవలందించిన డాక్టర్లు, సిబ్బంది

వాజేడు/గూడూరు, జూలై 10: ఆ వైద్యాధికారులు, సిబ్బంది తాము ఎంచుకున్న వృత్తిపై నిబద్ధతను చాటుకున్నారు. అందరిలాగా తమకెందుకులే అనుకోలేదు. ఎనిమిది గంటలు డ్యూటీ చేసుకుంటే తమ జీతం తమకు వస్తుందిలే అనుకోలేదు. సరైన రవాణా సౌకర్యాల్లేక.. మెరుగైన వైద్యం పొందలేక జ్వరాలతోనే మంచాల్లో మూలుగుతూ ఉండే అడవి పల్లెవాసులకు అండగా నిలవాలనుకున్నారు. రోడ్లు లేకపోయినా.. వంతెనలు లేకపోయినా.. అడవి దారిలో కిలోమీటర్ల మేర నడిచారు. వాగులు దాటారు. అడవి బిడ్డలకు వైద్యసేవలు అందించారు. ములుగు జిల్లా వాజేడు మండలం, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది బుధవారం అడవి బాటలో వెళ్లి.. వాగులు దాటి వైద్యసేవలందించారు.

● తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో ఎటువంటి రవాణా సౌకర్యం లేని మారుమూల కుగ్రామమైన వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి వాజేడు వైద్యాధికారి డాక్టరు అల్లి మధుకర్ తన సిబ్బందితో కలిసి కాలినడకన వాగులు, వంకలు, కొండలు దాటుకుంటూ వెళ్లారు. అయితే మంగళవారం మధ్యాహ్నమే వాజేడు పీహెచ్‌సీ నుంచి 17 కిలోమీటర్లు దూరంలో ఉన్న పెనుగోలుకు కాలినడకన బయలుదేరిన ఆ బృందం గుమ్మడి దొడ్డి మీదుగా ప్రమాదకరమైన నల్లందేవి వాగు దాటి రాత్రికి పెనుగోలు చేరుకున్నారు. ఆ తర్వాత బుధవారం ఉదయం వైద్యశిబిరం నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న గిరిజను లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పెనుగోలులో ప్రస్తుతం 10ఇళ్లు ఉండగా 39 మంది జనాభా ఉన్నారు. 15 ఏళ్ల లోపు చిన్నారులు 12మంది, ఏడాదిలోపు చిన్నారి ఒకరు ఉండగా ప్రస్తుతం ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ మధుకర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ మధుకర్ వెంట హెచ్‌ఏలు చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, ఎల్‌టీలు లఖన్, రజినీకాంత్, డీఏవో ప్రశాంత్, ఆశా కార్యకర్త సమ్మక్క, గుమ్మడిదొడ్డికి చెందిన కారం ఆదినారయణ, జజ్జరి ఆశోక్‌లు ఉన్నారు.

● గూడూరు మండలంలోని అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన మట్టేవాడ శివారు దొరవారి తిమ్మాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత మట్టేవాడ నుంచి ట్రాక్టర్‌లో కొత్తగూడ మండలం కార్లాయి వరకు వెళ్లి.. అక్కడ్నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర అడవి ప్రాంతంలో నడుస్తూ వాగులు దాటుకుంటూ దొరవారి తిమ్మాపురానికి చేరుకున్నారు. అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లిన వైద్యసిబ్బంది 42 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి, రక్తనమూనాలు సేకరించారు. ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు దేవేందర్, నరేష్, హెచ్‌ఈవో లోక్యానాయక్, సూపర్‌వైజర్లు అరుణమ్మ, హేమలత, ఎస్‌ఎన్.రజిత, హెల్త్ అసిస్టెంట్‌లు సర్దార్‌బాబు, లాలు, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్ సీతమ్మ పాల్గొన్నారు.





దొరవారి తిమ్మాపురానికి వాగుదాటుతూ వెళ్తున్న వైద్యులు, సిబ్బంది, దొరవారి తిమ్మాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 19వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని

తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం జిల్లాలలో 75రోజుల పాటు శిక్షణ ఇస్తామని, ప్రతీ సెంటర్‌కు 150 మంది చొప్పున శిక్షణ ఉంటుందని, కోచింగ్ వ్యవధిలో ప్రతీ అభ్యర్థికి రూ.5000 సైఫండ్ మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 040-24071178 నెంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన జంగా రాఘవరెడ్డి



తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జంగా రాఘవరెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 10: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో స్వీకరణ కార్యక్రమం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఇతర కాంగ్రెస్ నేతలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నాయకుల అభినందనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి పొంగులేటిని కలిసిన టీజీవోలు



మంత్రి పొంగులేటితో టీజీవోలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై10: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీజీవోస్ నాయకులు కలిశారు. ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన రెవెన్యూ, ఇతర డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వారి జిల్లాలకు బదిలీ చేయాలని ఈ సందర్భంగా టీజీవో నాయకులు మంత్రికి విన్నవించారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో టీజీవో భవనానికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర బాధ్యులు పరమేశ్వర్ రెడ్డి, యాదగిరి, టీజీవో నాయకులు ఈగ వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్‌లు ఉన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు నోటీసులు

లెక్కలు సమర్పించకపోవడంతో ఆడిట్ అధికారుల చర్య

వరంగల్ మెడికల్, జూలై 10: వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు ఆడిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎంజీఎంలో మందులు, భవన నిర్మాణ పనులు, స్టేషనరీ, అభివృద్ధి నిధులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ భారీగా తేడా వచ్చింది. దీంతో 30 అంశాలపై లెక్కలు, దానికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని ఆడిట్ అధికారులు గతంలోనే నోటీసులు ఇచ్చారు. దానికి సమాధానం రాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు. లెక్కలు, బిల్లులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. కాగా, ఎంజీఎంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సూపరింటెండెంట్ లెక్కలు ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆడిట్ అధికారుల నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారం వరంగల్ మెడికల్‌వర్గాల్లో సంచలనంగా మారింది. గతంలో ఉన్న సూపరింటెండెంట్‌పై అనేక ఆరోపణలు రావడంతో రెండేళ్ల కిందట చంద్రశేఖర్‌ను సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. అయితే ఈయన కూడా అదే దారిలో నడవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



మార్కెట్ కార్యదర్శి నిర్మలను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా నిర్మల బాధ్యతల స్వీకరణ

వరంగల్ సిటీ, జూలై 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత కార్యదర్శిగా పోలెపాక నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల గతంలో ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి(ప్యాక్)గా పనిచేశారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, కార్మికులు, రైతులతో ఆమెకు మంచి అనుబంధం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిర్మల పదోన్నతిపై వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన సంగయ్య ఉద్యోగ విరమణ చేయడం, ఎన్నికల కోడ్ ఉండటంతో వెంటనే ఆస్థానాన్ని భర్తీ చేయడానికి అవకాశం లేకపోయింది. దీంతో జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుగులోతు రెడ్డికి(ఫుల్ అడిషనల్ చార్జ్) వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించే క్రమంలో భాగంగా పోలెపాక నిర్మలకు పదోన్నతి కల్పించి కార్యదర్శిగా నియమిం చారు. దీంతో బుధవారం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నిర్మల పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎట్టకేలకు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించినప్పటికీ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించకపోవడంతో రైతులు, వ్యాపారులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శిని కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పూర్తి స్థాయి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పోలెపాక నిర్మలను వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రతినిధులు బుధవారం చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ఉపాధ్యక్షులు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరు వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, సంబంధిత సెక్షన్లప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ సీఎస్ఈ, ఐటీ బీవోఎస్ చైర్‌పర్సన్‌గా అర్చన



కృష్ణయ్య, అర్చనకు నియామక పత్రాలను అందిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 10: కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్ఈ, ఐటీ) విభాగం నూతనబోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్‌పర్సన్‌గా డాక్టర్ టి.అర్చన నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అర్చనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన కె.పద్మజ నుంచి అర్చన బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అర్చన 2010లో వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అర్చన గతంలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెం హాస్టల్ సంయుక్త సంచాలకులుగా, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఇన్‌చార్జిగా పనిచేశారు. డాక్టర్ అర్చన పర్యవేక్షణలో ఇద్దరు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 15కుపైగా అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టర్ అర్చన ప్రస్తుతం విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెంలో సంయుక్త సంచాలకులగా పనిచేస్తున్నారు. అర్చనను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

సంస్కృత విభాగం చైర్మన్‌గా కృష్ణయ్య

కాకతీయ యూనివర్సిటీ సంస్కృతం విభాగం నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా డాక్టర్ ఈ.కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కృష్ణయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ చైర్మన్‌గా కొనసాగిన పింగళి కళాశాల సంస్కృత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కృష్ణయ్యను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పొగతో ఉక్కిరి బిక్కిరి



తొడిమెలను కాల్చిన దృశ్యం

కోల్డ్ స్టోరేజీల పక్కన కుప్పలుగా పోసిన తొడిమెలు

- ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలో మిర్చి తొడిమెల కాల్చివేత
- ఘాటు పొగతో తీవ్ర ఇబ్బంది పడుతున్న సమీప ప్రజలు
- ఊపిరితిత్తుల సమస్యల బారిన పడుతున్న వైనం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- కనిపించని పారిశుధ్య అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: వారంత నిరుపేదలు.. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక కష్టాన్ని నమ్ముకుని పొట్టచేత పట్టుకుని కట్టుబట్టలతో నగరానికి వచ్చి కష్టాల కడలిలో కాలం వెల్లదీస్తున్నారు. వారిని పేదరికం వదిలినా.. మిర్చి ఘాటు కాలుష్యం మాత్రం వదలకుండా ఆరోగ్యాలను క్షీణింపజేస్తోంది. దీంతో శ్వాసకోశ వ్యాధులు అస్తమా, టీబీ, దగ్గు, దమ్ము, క్షయవ్యాధులతో పాటు గుండె పోటుకు గురవుతున్నారు. ఇదంతా ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన ఏనుమాముల మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల కాలనీలలో జరుగుతోంది.

సాయంత్రం అయ్యిందంటే ఏనుమాముల చుట్టుపక్కల ప్రాంతం కాలనీలో కాలుష్యంతో కమ్ముకుపోతోంది. అడ్తిదారులు, సంపన్న వర్గాలు ప్రజల ప్రాణాలు లెక్క చేయకుండా మిర్చి తొడిమెలు మంటల్లో కాలుస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. యేడాదిలో ఆరు మాసాలు మిర్చి సీజన్‌లో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మిర్చి తొలడిమెలు తీసి మార్కెట్ పరసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలు, మిర్చి కల్లాల వద్ద రాత్రి సమయాల్లో కాలుస్తుండడంతో సమీప ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. మార్కెట్ పరిసర కాలనీలైన గ్రేటర్ 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్, గాంధీనగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, ఏనుమాముల, దేశాయిపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో సాయంత్రం సమయంలో మిర్చి తొడిమెలు ఘాటు కాలుష్యం కోరలు చాస్తోంది. తొడిమెలు కాల్చిన కాలుష్యపు ఘాటు ప్రజలను నిద్రకు దూరం చేస్తోంది. ఈ ప్రాంతంలో నివసించే వారు కాలుష్య కోరలకు బలవుతూ శ్వాసకోశ, గుండె జబ్బులకు గురవుతున్నారు.

200కు పైగా మిర్చి కల్లాలు


ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కల్లాలు 200కు పైగా విస్తరించి ఉన్నాయి. అడ్తిదారులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజీల ఆవరణలో వందలాది టన్నుల మిర్చిని డంప్ చేయడంతో పాటు ఆరబోస్తున్నారు. వీటిని సమీపగ్రామాల్లో నివసించే మహిళా కూలీలతో తొడిమెలు తీయిస్తున్నారు. తీసిన తొడిమెలను కోల్డ్ స్టోరేజీల బయటపోసి మిర్చిని ఎండబెట్టి కారంపొడి చేసి ఇతర ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే నిర్లక్ష్యంగా బయటపోసిన తొడిమెలను నిర్వాహకుల ఆదేశాల మేరకు అక్కడ పని చేసే కూలీలు సాయంత్రం సమయంలో నిప్పుపెడుతుంటారు. ఇక దాంట్లోంచి వచ్చే పొగతో ఆ సమీప ప్రాంతాల్లో నివసించే వారికి నరకం కనబడుతోంది.

పత్తాకు లేని పారిశుధ్య సిబ్బంది

ఏనుమాముల మార్కెట్ సమీపంలో మిర్చి కల్లాల వద్ద చాలా కాలంగా ఇదంతా జరుగుతున్నా పారిశుధ్య కార్మికులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మునిసిపల్ సిబ్బంది సైతం మిర్చి ఘాటుకు భయపడి అటుగా వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఈ ప్రాంతాన్ని పరిశీలించే శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపం వల్లనే తొడిమెల కాల్చివేతకు వ్యాపారులు పూనుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. కోల్డ్ స్టోరేజీల బయట పడేసిన మిర్చి తొడిమెలను ముందస్తుగా గుర్తించి మునిసిపల్ ట్రాక్టర్లు, డంపర్‌బిన్‌ల ద్వారా తరలించాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న జవాన్లు నెలవారి మామూళ్లకు ఆశపడి వ్యాపారుల ఆకృత్యాన్ని పట్టించుకోవడం లేదని చుట్టుపక్కలవారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మిర్చి తొడిమెలను కాల్చే వారిని బల్దియా సిబ్బంది గుర్తించి జరిమానాలు విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారు..

డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్. చెస్ట్ ఫిజిషియన్



మిరప తొడిమెలనుంచి వచ్చే ఘాటు పొగ పీల్చుకోవడం వల్ల ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధితోపాటు నిమోనియా వస్తుంది. కండ్లు ఎర్రగా మారుతాయి. ముక్కులో ఎలర్జీ వచ్చి తుమ్ములు, దగ్గు వస్తాయి. ఇంకా జలుబుతో పాటు ఆయాసం వస్తుంది. కొద్ది రోజుల తర్వాత అస్తమాకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. శరీరంపై దద్దుర్లు, కురుపులు ఏర్పడి మంటతో కూడిన దురద ఏర్పడుతుంది. ఇంకా దీర్ఘకాళిక వ్యాధులైన హైపల్ సెన్సివిటీ, బీపీ వచ్చే అవకావాలు ఉంటాయి. ఈ పొగ నుంచి ప్రజలు దూరంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది.

రాత్రి అయిందంటే పొగతో చస్తున్నాం..

ఉడుత కాంతమ్మ, ఎన్టీఆర్ నగర్



రాత్రి అయ్యిందంటే వందలాది మిర్చి కల్లాలు రోడ్లు, గోదాముల ముందు పెద్ద ఎత్తున వెలుస్తాయి. వందల మంది కూలీల ద్వారా తీసిన తొడిమెలు అక్కడే వదిలేసి వెళ్లడంవల్ల రాత్రి సమయాల్లో నిప్పు అంటిస్తారు. తెల్లవారేవరకు ఈ ప్రాంతం ఘాటు పొగతో కప్పబడి ఉంటుంది. ఇప్పటికే చాలామంది రోగాల బారిన పడ్డారు. కొందరు గుండెపోటుకు గురయ్యారు.

సోడషపల్లిలో నకిలీ నోటు కలకలం

వేలేరు(ధర్మసాగర్), జూలై 10: హనుమకండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లి పోస్టు ఆఫీసులో నకిలీ ఐదు వందల నోటు ఇచ్చారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. సోడషపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే వృద్ధుడు వృద్ధాప్య పింఛన్ కోసం ఐదు రోజుల కిందట స్థానిక పోస్టు ఆఫీసుకు వెళ్లాడు. పింఛన్ తీసుకుని తిరిగి ఇంటికి వచ్చాడు. ఐదు రోజుల తర్వాత గ్రామంలోని ఓ దుకాణానికి వెళ్లగా రూ.500 నోటు చెల్లదని షాపు యజమాని చెప్పడంతో అక్కడ ఉన్న వారు నోటును గమనించి నకిలీనోటు అని వృద్ధుడికి చెప్పారు. దీంతో విషయన్ని బాధితుడు తన కుమారుడు ప్రభాకర్‌రెడ్డికి తెలుపడంతో ఆయన పోస్టు ఆఫీసుకు ఫోన్ చేసి నకిలీ నోటు ఇచ్చారని తెలిపాడు. దీంతో సదరు పోస్టాఫీసు ఉద్యోగి దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నకిలీ నోటు పంపిణీ చేసిన పోస్టు ఆఫీసు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

ధర్మసాగర్, జూలై 10: ఓ యువతి అదృశ్యమైన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకు చెందిన గుగులోతు కల్పన (22)అనే యువతి ఈనెల 1న హనుమకొండలో పరీక్ష రాయడానికి ఇంటి నుంచి వెళ్లింది. పరీక్ష రాయడానికి వెళ్లి సాయత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు కల్పన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ దొరకకపోవడంతో ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి భిక్షపతి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

సత్యాగ్రహ దీక్షలో మాజీ ఎంపీ సీతారాం నాయక్


రైతు సత్యాగ్రహ దీక్షలో మాజీ ఎంపీ సీతారాం నాయక్

ములుగు కలెక్టరేట్, జూలై 10: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. ములుగులోని గాంధీ విగ్రహం వద్ద కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేసేందుకు యత్నిస్తోందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటుతున్నా రైతులను పట్టించుకోవడంలేదని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, ప్రతి ఎకరాకూ రైతుభరోసా కింద రూ.15వేలు అందించాలని, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు అందించాలని, రాష్ట్రంలో ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు లోడె శ్రీనివాస్, నాయకులు జాడి రామరాజు, జినుకల కృష్ణాకర్, కొత్త సురేందర్, రమేష్, జవహర్‌లాల్, నాగరాజు, పల్లా బుచ్చయ్య, గుగులోత్ స్వరూప, వావిలాల జనార్ధన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు సర్వే

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై10: సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవల కోసం క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మహిళాశక్తి ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన మీ-సేవ సహాయక కేంద్రాల ద్వారా ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ దరఖాస్తుల తప్పులు సరి చేసేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి ఆహార పదార్థాలు, పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేయాలని సూచించారు. వసతి గృహాల్లోని విద్యార్థులు అనారోగ్యం బారినపడకుండా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల ఆందోళన


చిట్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

మొగుళ్లపల్లి, జూలై 10: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఖ్యాతం విజయ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఆశా కార్యకర్తలు విధులు నిర్వర్తిస్తున్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి బతుకులు మారడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్‌హెచ్‌ఎం సేవలకు బడ్జెట్ పెంచి ప్రైవేటీకరణను రద్దు చేయాలని, ప్రతినెలా రూ.10వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలని, ప్రతినెలా రూ.18వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సునీత వినతిపత్రం అంద జేశారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్లు వర్ధెల్లి భారతి, గోల్కొండ సుమలత, స్వరూప, స్వప్న, అరుణ పాల్గొన్నారు.

- చిట్యాల: సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, పలు శాఖల కాంట్రాక్టు సిబ్బంది నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భూక్య నవీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మొహియొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు కుంచాల రాధిక, సాయివేద, సుమలత, మానస, కల్యాణి, రమ, భాగ్యలక్ష్మి, కల్పన పాల్గొన్నారు.
- మంగపేట: ఆశా కార్యకర్తలు మంగపేట బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ వీరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు డివిజన్ గౌరవ అధ్యక్షుడు ముత్యాలు, మండల అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల మండల నాయకులు, సీఐటీయూ నాయకులు ప్రభావతి, నాగమణి, శ్రావ్య రాణి, శోభ, వసంత, కుమారి, నళిని, రమాదేవితో పాటు మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల పరిధి 75 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం: స్కీం వర్కర్లకు 14, 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం కనీసవేతనం అమలు చేయాలని డిమాండు చేస్తూ సీఐటీయూ మండల కార్యదర్శి కావేరి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు.
- అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సలీంకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ బిల్లులు వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సూరమ్మ, పార్వతి, రాధమ్మ, ఆశా కార్యకర్తలు పాప, రమాదేవి, నాగమణి, జీపీ కార్మికులు సమ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

వాజేడు, జూలై 10: వరదలు, తదితర ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని వరద ముంపునకు గురయ్యే సరిహద్దు గ్రామం టేకులగుడెం వాసులకు పలు జాగ్రత్తలు వివరించారు. ఆకస్మాత్తుగా వరదలు సంభవించినప్పుడు ఎలా అప్రమత్తం కావాలనే అంశంపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 100, 101, 108, 112 నంబర్లపై కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, పాముకాటు, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఎలాంటి ప్రమాదాల్లోనైనా సురక్షితంగా బయటపడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానంపై సూచనలు చేశారు. వరదలు సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అన్ని ఏర్పాట్లు ఉంటాయని వరద బాధితులు అందులో తలదాచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ జనరల్ డ్యూటీ ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర సింగ్ యాదవ్, సీటీ వెంకట రవి, తహసీల్దార్ శ్రీనివాస్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, జీపీ కార్యదర్శులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో వైద్య శిబిరం

మంగపేట, జూలై 10: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కోమటిపల్లి సబ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ ఆవరణతోపాటు గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న 13 మంది రక్త నమూనాలను పరీక్ష నిమిత్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వైశాలి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఏఎన్ఎంలు స్వరూప, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊర చెరువును పరిశీలించిన ఐబీ ఎస్ఈ

గణపురం, జూలై 10: మండలంలోని ధర్మరావుపేట శివారులో ఉన్న ఊర చెరువును ఐబీ ఎస్ఈ విజయ భాస్కర్ బుధవారం పరిశీలించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఊరచెరువుకు గండ్లు పడగా అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. పనులు చివరి దశకు చేరుకోవడంతో పనులను ఎస్ఈ పరిశీలించారు. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులకు పూర్తి స్థాయి ఆయికట్టు వరకు సాగవుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట అధికారులు మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, బసవప్రసాద్ ఉన్నారు.

రామప్పను సందర్శించిన రైల్వే ఎస్పీ


శిల్పకళా సౌందర్యాన్ని వీక్షిస్తున్న రైల్వే ఎస్పీ

వెంకటాపూర్(రామప్ప), జూలై 10: మండలంలోని రామప్ప దేవాలయాన్ని రైల్వే ఎస్పీ చందనదీప్తి బుధవారం సందర్శించారు. ముందుగా ఆమె రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ శిల్పకళా సంపదను కనులారా వీక్షించిన చందనదీప్తి గైడ్‌ల ద్వారా విశిష్టతలను తెలుసుకున్నారు. నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆమెవెంట స్థానిక ఎస్సై సతీష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఏఐటీయూసీ దీక్షలు


నిరాహార దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

కాకతీయఖని, జూలై 10: బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి ఏరియా జీఎం కార్యలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా కేటీకే-6వ గని పిట్ సెక్రటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుడుదుల వెంకటేశ్, రామ్‌చందర్, సత్యనారాయణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పాత్రాపురంలో మాతోట కార్యక్రమం

వెంకటాపురం(నూగూరు), జూలై 10: మండలంలోని పాత్రాపురం గ్రామంలో బుధవారం నాబార్డు ఆధ్వర్యంలో మాతోట కార్యక్రమాన్ని వనసమాఖ్య స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డు డీడీఎం రవిచైతన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీధర్‌లు హాజరై రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా నాబార్డు డీడీఎం రవిచైతన్య మాట్లాడుతూ వనసమాఖ్య స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నాబార్డు ఆర్థికసహాయంతో మండలంలోని ఎదిర, యాకన్నగూడెం, సూరవీడు, కేకొండాపురం, మొర్రవానిగూడెం, పాత్రాపురం, రాచపల్లి, టేకులబోరు గ్రామాల్లోని 450ఎకరాల్లో గిరిజన రైతులతో పండ్లతోటల పెంపకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు 56మామిడి, 22జామ, 70టేకు మొక్కలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మాతోట మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలు వేసుకుని అదనంగా ఆదాయం పొందే అవకాశం ఉందని అన్నారు. అనంతరం పాత్రాపురంలో మాతోట శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, జిల్లా హార్టీకల్చర్ అధికారి లావణ్య, ఏఈవోలు శ్యామ్, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

చిట్యాల, జూల 10: మండల కేంద్రం, జూకల్లులోని వసతి గృహాలను జడ్పీసీఈవో విజయలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. స్థానికంగా ఉన్న బీసీ, ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికలు, గురుకుల బాలికల హాస్టల్, జూకల్లులోని ఎస్సీ బాలికల వసతి గృహాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. వంట గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, స్నానాల గదులు, స్టోర్ రూంను సందర్శించారుపరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డెన్ నేపాలి వేణుసింగ్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 10: గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని గుర్రంపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామానికి చెందిన కొర్ర రాజన్న-కల్పన దంపతుల కువరుడు కొర్ర రాజ్‌కుమార్ ఇంటి వద్దే ఉంటున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసె మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయం చూసి గడ్డిమందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అయన్ను గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన భూపాలపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు కాగా తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ : ఎస్పీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 10: ప్రజల్లో అవగాహన పెరిగితేనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సైబర్ మోసగాళ్ల భారీ నుంచి ప్రజలు మోసపోకుండా అవగాహ కల్పించే పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరస్థుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనధికార లింకులు మెస్సేజ్‌ల రూపంలో వస్తే స్పందించొద్దని సూచించారు. ఆధార్, బ్యాంకు అకౌంటు తదితర వ్యక్తిగత ఎవరికీ వెల్లడించొద్దన్నారు. ఈ కార్య క్రమంలో సైబర్‌క్రైమ్ డీఎస్పీ సుభాష్‌బాబు, భూ పాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మో హన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఖరే

కర్లపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడీవో

గోవిందరావుపేట, జూలై 10: మండలంలోని కర్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఏటీడీవో దేశిరాంనాయక్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హెచ్‌ఎం కల్తి శ్రీనివాస్‌తో కలిసి పదోతరగతిగదిని సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కాచి చల్లార్చిన నీటిని అందించాలని అన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూలై 10: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో కాపెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, బాండెడ్ లేబర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సంస్థ డైరెక్టర్ లూర్థురాజు మాట్లాడుతూ 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, 18ఏళ్లు నిండకుండా వివాహాలు చేయవద్దని అన్నారు. ఈకార్యక్రమంలో ఏసీడీపీవో ముత్తమ్మ, సంస్థ సభ్యులు హనుమంతు, కామేష్, ఉష, ప్రశాంత్, నరేష్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(నూగూరు), జూలై 10: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ఫీవర్ సర్వే జరిగింది. ఈసందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ అభ్యర్థులకు టైపింగ్ పరీక్షలు

ములుగు కలెక్టరేట్, జూలై 10: ములుగులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 11,13,14,15 తేదీల్లో టైపింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దివాకర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విధిగా హాజరుకావాలని సూచించారు. పది పోస్టులకు 626మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, అందులో అర్హులైన 502 మందికి టైపింగ్ పరీక్ష గోవిందరావుపేట మండలంలోని పస్రా జడ్పీహెచ్ఎస్‌లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు అప్లికేషన్ అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు, ఫొటో కలిగిన గుర్తింపుకార్డుతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి

కన్నాయిగూడెం, జూలై 10: వర్షాకాలం ప్రభావంతో వరదల సంభవించే అవకాశం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అనిత అన్నారు. మండలంలోని ఎమ్మార్సీ భవనంలో మండల ప్రత్యేక అధికారులు, మెడికల్ ఆఫీసర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. వరదలు సంభవిస్తే ప్రజ లను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వృద్ధులు, విక లాంగుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రసూతికి ఉన్న మహిళలను ఆగస్టు 15 లోగా ఏటూరునాగరం సామాజిక దవాఖానకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సలీం, ఎంపీవో రామకృష్ణ, నీటిపాదుల శాఖ డీఈ శరత్ కుమార్ పాల్గొన్నారు.

'పశు వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి'

టేకుమట్ల, జూలై 10: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మల్లేష్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు పశువులను ఆస్పత్రికి తీసుకొస్తే ఉచితంగా మందులు ఇవ్వకుండా వైద్యాధికారులు బయట షాపులకు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మందులను సరఫరా చేస్తున్నప్పటికీ కమీషన్ల కోసం పాకులాడుతున్నారని దుయ్యబట్టారు.

క్రీడాకారుడికి ఎస్సై ఆర్థిక సాయం


ధర్మతేజకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు, జూలై 10: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన నిరుపేద క్రీడాకారుడు టింగా ధర్మతేజకు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. గోవాలో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే తైక్వాండో క్రీడలో ధర్మతేజ జాతీయస్థాయి 54 కిలోల విభాగంలో పాల్గొనున్నాడు. అంతకుముందు జనవరిలో జరిగిన సౌత్ ఇండియన్ నేషనల్స్‌లో రజత పతకం సాధించాడు.

పెరుగుతున్న గోదావరి ప్రవాహం

మహదేవపూర్, జూలై 10: కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరవం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. బుధవారం ఉధృతి మరింత పెరగడంతో గోదావరిలో జలకళ సంతరించుకుంది. ఈ దృశ్యాన్ని భక్తులు, పర్యాటకులు తమ సెల్ఫీల్లో బంధిస్తున్నారు.

వన మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

కాటారం, జూలై 10: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే వన మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీవో(ఈజీఎస్) వసుమతి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఈజీఎస్ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వనమహోత్సవం, మొక్కలు నాటడానికి గుంతలు తవ్వకం, ఇంటింటా మొక్కల పంపిణీ, ఉద్యానవన మొక్కల పెంపకం, గుడ్ గవర్నెన్స్ పారా మీటర్లపై సమీక్షించారు. ప్లాంటేషన్, హార్వెస్టింగ్ పాండ్స్, నర్సరీలు, మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్ పనుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిం చొద్దన్నారు. పండ్ల తోటల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి బ్లాక్, బండ్ ప్లాంటేషన్ల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఏపీవో వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, మనోజ్, రవళి, రవి, పంచాయతీ కార్యదర్శులు, ఏఫ్ఏలు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య


రాజుపేటలో మాట్లాడుతున్న సూర్య

మంగపేట, జూలై 10: కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సమస్యలను పరిష్కరించుటకు ప్రత్యేక కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. రాజుపేటకు చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇస్సార్‌ఖాన్ జన్మదినాన్ని పురష్కరించుకొని కేక్ కట్ చేశారు. మంగపేటలోని అనాథ వృద్ధాశ్రమంలో ఎండ్లు, బెడ్లను యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పంపిణీ చేశారు. మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పిహెచ్‌సీలలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు సూర్య హాజరయ్యారు. కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి కర్రి నాగేంద్రబాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుంట్ల నరేందర్, యువ.న కాంగ్రెస్ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గద్దల నవీన్, యువజన కాంగ్రెస్ నాయకులు బండారి అక్కి, చెట్టుపల్లి ముకుందం, ముస్తఫా, కస్పా ముకుందం, ఎడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం : ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, జూలై 10: గ్రామీణ ప్రాంత పేదల కోసం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని కేకేఎంఎస్ ప్రసాద్ ఆస్పత్రిలో ప్రతిమ రిలీఫ్, అమృత వర్షిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందించడం గొప్ప విషయమన్నారు.

పోలీసుల కార్డన్‌సెర్చ్

కాటారం, జూలై 10:మండలంలోని ఆదివారంపేట జీపీ పరిధిలో బుధవారం రాత్రి పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాటారం సీఐ నాగార్జునరావు నేతృత్వంలో కాటారం, మహాముత్తారం, కొయ్యూరు ఎస్సైలు అభినవ్, మహేందర్, నరేష్, కాటారం ఎస్సై-2 హరిశేఖర్ ఆధ్వర్యంలో 50మందికి పైగా సివిల్, టీఎస్ఎస్పీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని 10బైక్‌లను పట్టుకుని జరిమానాలు విధించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. యువత గంజాయి, గుట్కా, గేమింగ్ వంటివాటికి దూరంగా ఉండాలని అన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మల్హర్, జూలై 10 : మండలంలోని ఎడ్లపల్లిలో బుధవారం షిర్డీ సాయిబాబా ఆలయ నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షుడిగా బత్తుల తిరుపతి, గౌరవ అధ్యక్షులుగా జనగాం బాపు, జంగిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జంగిడి సమ్మయ్య, ఉపాధ్యాక్షుడిగా కోలేటి రాజబాబు, జనగాం పోచయ్య, కోశాధికారిగా ఉప్పట్ల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాల యాదిగిరిరావు, జనగాం పోచయ్య, బుచ్చ య్య, సారయ్య, మాంతయ్య, లక్ష్మన్, రమేష్, లింగయ్య, దేవేంద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మంచిరోజులు!

(3వ పేజీ తరువాయి)

కొట్టుకుపోకుండా మత్తళ్లకు స్థానిక మత్సకారులు ఏర్పాటు చేసుకున్న పనులే చెరువులు కొట్టుకుపోవడానికి కారణమని నిర్ధారించిన నీటిపారుదల అధికారులు అప్పటి ఉన్నతాధికారు లకు వివరణ ఇచ్చుకున్నారు. వరదల వల్ల చెరువు మత్తడి గుండా చేపలు కొట్టుకుపోకుండా మత్సకారులు ఇనుప జాలీ లను కట్టారు. చెరువులోకి వచ్చే వరద నీరు బయ టకు వెళ్లే క్రమంలో మత్తళ్ల వద్ద అక్రమంగా ఏర్పాటుచేసిన ఇనుప జాలీలకు వరదల్లో వచ్చే చెత్తాచెదారం పేరుకుపోయి అడ్డుకట్టగా ఏర్పడి కట్టలపై ఒత్తిడి ఏర్పడిందని తెలుస్తోంది. దీంతో కట్టలు కొట్టుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. భూపాలపల్లి మండలం కొత్తపల్లి(ఎస్ఎం) శివారు దొమ్మ టిపల్లి చెరువు, రేగొండ మండలం చిన్నకోడేపాక చెరు వులు ఈ కారణంతోనే తెలిపోయాయి. మరిన్ని చెరువులు కూడా ఇలానే ధ్వంసమయ్యాయి. మత్తడి గుండా చేపలు కొట్టు కుపోకుండా తెరలు మాత్రమే ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా మత్స్యకారులు పటిష్ఠ జాలీలను ఏర్పాటు చేసుకోవడం వల్లే చెరువులు తెగిపోవడానికి కారణమని తెలుస్తోంది. దీనిపై అధికారులు మొదట్లోనే దృష్టి పెట్టలేదని, దీని వల్లే చెరువులకు నష్టం వాటిల్లిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్యకారులకు అవగాహన కల్పిస్తే ఇలా చెరువులు ధ్వంసమయ్యేవి కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.